క్లుప్తంగా

వెలవెలబోయిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రాయదుర్గంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సూపర్ సిక్స్‌కు తిలోదకాలు ఇచ్చి ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ప్రజలపై భారం మోపుతోంది. ఈనెల 1న భారీగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడంతో శుక్రవారం దాకా క్రయవిక్రయదారులతో రద్దీగా ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయం .. శనివారం వెలవెలబోయింది. పాత చార్జీలతో శుక్రవారం చివరి రోజు కావడంతో దాదాపు 25 రిజిస్ట్రేషన్లు అ య్యాయి. పెంచిన చార్జీలు అమల్లోకి వచ్చిన మరుసటి రోజు శనివారం ఒక్క రిజిస్ట్రేషన్ కాలేదు.

నేమకల్లులో నాకాబందీ

బొమ్మనహాళ్: కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ ఆదేశాల మేరకు బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ నేమకల్లు గ్రామంలో శనివారం తెల్లవారుజామున నాకాబందీ నిర్వహించారు. గ్రామంలోని రౌడీషీట్ల ఇళ్లు, కళ్లం దొడ్లను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో ప్రశాంతంగా జీవించాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏఎస్ఐ హనుమంతరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరెకరాల్లో కంది పంట దగ్ధం

బెళుగుప్ప: హనిమరెడ్డిపల్లి సమీపంలో రైతు చంద్రప్పకు చెందిన ఆరు ఎకరాల్లో కంది పంట శనివారం కాలిపోయింది.బాధిత రైతు చంద్రప్ప మాట్లాడుతూ ఆరెకరాల్లో డ్రిప్ పైపులతో కంది సాగు చేసినట్లు తెలిపాడు. అటవీప్రాంతానికి సమీపంలో ఉన్న కంది పంటకు మంటలు వ్యాపించి, పంటతో పాటు డ్రిప్ పైపులు కూడా కాలిపోయాయని తెలిపాడు. రూ.2.5 లక్షల పంట నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

నియమాలు పాటించాలి

రాయదుర్గంటౌన్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఆయన భారీ వాహనాల రాకపోకలపై తనిఖీలు చేశారు. కచ్చితంగా డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సూచించారు.

మహిళలకు రక్షణ కరువు

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు వసంత్‌బాబు, నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని టీసర్కిల్లో నిరసన తెలియజేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ వసంత్‌బాబుకు వినతి పత్రం అందించారు. దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు మల్లాపురం దొణస్వామి, పట్టణ అధ్యక్షుడు ఉదీప్, నాయకులు పాల్గొన్నారు.

ముద్దలాపురానికి బస్సు

బ్రహ్మసముద్రం : మండలంలోని ముద్దలాపురానికి బస్సు సౌకర్యం కల్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాయలప్ప దొడ్డి ముద్దలాపురం మధ్య రాకపోకలకు టీడీపీ నాయకులు పట్టా భూముల్లో దారి లేదంటూ కంచెలు వేసి, రాయలప్ప దొడ్డి గ్రామానికి వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు కలిగించారు. దీంతో ముద్దలాపురం గ్రామస్తులు తమ గ్రామానికి దారి చూపాలని అధికారులకు విన్నవించారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు స్పందించి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. శనివారం ముద్దలాపురం బస్సును ప్రారంభించారు.

స్థల పరిశీలన


భూమిని పరిశీలిస్తున్న డాక్టర్లు, ఇంజనీర్లు

కుందుర్పి: ఎనుములదొడ్డి వద్ద నిర్మించనున్న ఆరోగ్య కేంద్రానికి స్థలాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంత్, మల్లికార్జున, బాదపల్లెప్ప తదితరులు సర్వేనంబర్ 109బీలో 1.50 ఎకరం భూమిని దానం చేశారు. ఆరోగ్య కేంద్రానికి రూ.2.86 కోట్లు మంజూరయినట్లు సర్పంచు విజయ్ తెలిపారు. డాక్టర్లు సోమేష్ కుమార్, నారాయణస్వామి, రెవెన్యూ అధికారులు, సైట్ ఇంజనీర్లు, స్థల దాతలు పాల్గొన్నారు.

అడ్డగోలు అంతస్తులు


కోతిగుట్టలో నిర్మిస్తున్న ఇల్లు

- అనుమతి ఉండదు .. నిర్మాణాలు ఆగవు
- ఇరుకు వీధుల్లోనూ బహుళ అంతస్తుల భవనాలు
- నోటీసులతో సరిపెడుతున్న యంత్రాంగం
- పట్టణ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఇష్టారాజ్యం

▶▶ కణేకల్లు రోడ్డులోని ప్యాలెస్ థియేటర్‌కు వెళ్లే రస్తాలో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇవి పూర్తిగా రహదారికి ఆనుకొని ఉన్నాయి. అధికారులు నిత్యం ఇటువైపు వెళ్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

▶▶ రాయదుర్గంలోని టీచర్స్ కాలనీలో ఓ వ్యక్తి బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టారు. మొదటి అంతస్తు వరకే అనుమతి పొంది మూడంతుస్తుల నిర్మాణాలు చేపట్టారు. అయినా అడ్డుకునే నాథుడే కరువయ్యారు.

▶▶ రాయదుర్గంలోని కోతిగుట్ట, రాజీవ్ గాంధీ కాలనీ, కొలిమివీధి, శాంతినగర్, మేదర వీధి ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు వెలిశాయి. జీ+1 కూడా కొందరు అనుమతులు పొందడం లేదంటే రాజకీయ పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇలా వివిధ కాలనీల్లో అక్రమ నిర్మాణాలు రోజుకోచోట నిర్మిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రాయదుర్గం: స్థానిక పురపాలక సంఘం పరిధిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికార యంత్రాంగం చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడంతో అక్రమ నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా పనులు సాగిస్తున్నారు. సంబంధిత మున్సిపల్‌శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వంద, రెండొందల గజాల్లో రెండు, మూడు ఆపై అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలాంటి వాటిని నియంత్రించాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేయడానికే మీనమేషాలు లెక్కిస్తున్నారు. మొదటి అంతస్తు నిర్మాణంలో ఉన్నప్పుడు అందిన ఫిర్యాదుపై స్పందించేందుకు చాలా కాలం తీసుకోవడంతో మూడో అంతస్తు వరకు పనులు చకచకా సాగిపోతున్నాయి. ఒకరిని చూసి మరొకరన్నట్టు తక్కువ స్థలంలో బహుళ అంతస్తుల భవనాలు సులువుగా నిర్మించేస్తున్నారు. అంతస్తులే కాకుండా అనుమతుల్లేకుండా కొన్ని పాఠశాలలు, షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించేస్తున్నారు.

ఈ ప్రాంతాల్లోనే..

రాయదుర్గం పట్టణంలో 32 వార్డులు ఉన్నాయి. 10,852 కుటుంబాలు, 75 వేలు జనాభా ఉంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో ఇళ్ల నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. పోటాపోటీగా అంతస్తులు పెంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కణేకల్లు, అనంతపురం, బీటీపీ, మొలకాల్మూరు, బళ్లారి రోడ్లతో పాటు టీచర్స్, రాజీవ్‌గాంధీ, డ్రైవర్స్, జేఆర్ఎస్ కాలనీల్లో అక్రమ నిర్మాణాలు అంతస్తులు దాటిపోతున్నట్టు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కూల్చివేతల ఊసే లేదు

అక్రమ నిర్మాణాలకు సంబంధించి అధికారులపై ఒత్తిడి వస్తే నోటీసులు జారీ చేస్తున్నారు. ఆ తర్వాత కనీసం అటువైపు కన్నెత్తికూడా చూడడం లేదు. దీంతో ఆ నోటీసులకు యజమానులు ఖాతరు చేయడం లేదు. చాలా కాలంగా కూల్చివేతల ఊసే లేకపోవడంతో నిర్మాణదారులు నిర్భయంగా పనులు కొనసాగిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇరుకు వీధుల్లోనూ కనీసం దారి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు.

జీ+2 వరకే అనుమతి

మున్సిపల్ నిబంధనల మేరకు 300 చ.మీలోపు జీ+2 వరకే పట్టణంలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా జీ+3, జీ+4 జీ+5 ఆపై అంతస్తులు పెరిగిపోతున్నాయి. అధికారులు మాత్రం వారి దృష్టికి వచ్చిన వాటికి మాత్రమే నోటీసులు ఇచ్చి చేతులు దులిపేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆధాయానికి భారీగా గండి పడుతోంది. సంబంధిత అధికారులు కాలనీల్లో పర్యటించి అక్రమ కట్టడాల అదుపునకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


డ్రైవర్స్ కాలనీలో అంతస్తులు దాటిన కట్టడం

కఠిన చర్యలు చేపడతాం



అనుమతుల్లేకుండా అంతస్తులు దాటిస్తే కఠిన చర్యలు చేపడతాం. అక్రమ కట్టడాలు గుర్తించి చర్యలు చేపట్టేలా టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశాలిస్తాం. ఇందులో ఎంతటివారున్నా ఉపేక్షించేది లేదు. కట్టడం ఏదైనా సరే తప్పక మున్సిపల్ అనుమతి పొందాలి. ఆ దిశగా అవగాహన కూడా కల్పించాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

విద్యారంగానికి చంద్ర గ్రహణం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు
- 5న జిల్లా కేంద్రంలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా


ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యా రంగాన్ని సమూలంగా నాశనం చేసేలా కంకణం కట్టుకుందని, విద్యా రంగానికి చంద్రగ్రహణం పట్టుకుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. శనివారం పట్టణంలోని తన నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ భోజరాజ్‌నాయక్, బొమ్మనహాళ్ మండల కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు మారెన్న, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, ఇతర అనుబంధ సంఘాలు, కౌన్సిలర్లతో కలిసి ఈనెల 5న జిల్లా కేంద్రంలో తలపెట్టిన ఫీజు పోరు పోస్టర్లు విడుదల చేశారు.

'ఫీజు పోరు' విజయవంతం చేద్దాం..

అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి తక్షణమే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన ఫీజుపోరు కార్యక్రమం విజయవంతం చేద్దామన్నారు. ఫిబ్రవరి 5న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రం జెడ్పీ కార్యాలయం వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, పార్టీ శ్రేణులు భాగస్వాములుకావాలన్నారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం విద్యా దీవెన కింద రూ.2,800 కోట్లు, వసతి దీవెన కింద రూ.1100 కోట్లు కలిపి మొత్తం రూ.3,900 కోట్లు బకాయి ఉందన్నారు. దీంతో కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను తరగతులకు రానివ్వడం లేదని, సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వానికి పేద విద్యార్థుల చదువుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప మాట్లాడారు.. ఫీజు బకాయి పెరిగిపోవడంతోనే విద్యార్థుల బలవన్మరణాలు అధికమయ్యాయన్నారు. కార్యక్రమంలో కణేకల్లు మాజీ ఎంపీపీ రాజగోపాలరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి, ఎర్రగుంట కేశవరెడ్డి, కోకుర్తి జయరామిరెడ్డి, పొరాళ్ల శివ, మేకల శ్రీనివాసులు, జీ రామాంజనేయులు, రవీంద్రనాథ్‌రెడ్డి, దిలవర్ బాషా, నేమకల్లు పరమేశ్వర, కణేకల్లు బ్రహ్మానందరెడ్డి, పైనేటి తిమ్మప్ప, పట్టణ కౌన్సిలర్లు పైతోట సంజీవ, గౌని లావణ్య, వార్డు ఇన్‌చార్జులు శ్రీనివాసులు, గౌని శ్రీరామిరెడ్డి, బషీర్, నిజామ్, బీసీసెల్ అధ్యక్షులు తొండె వెంకటేశులు, యూత్ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, గుమ్మఘట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.


మెట్టుతో కలసి వధూవరులను ఆశీర్వదిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి, నాయకులు

శుభకార్యం

రాయదుర్గం: పట్టణంలోని మద్దానేశ్వర కల్యాణ మంటపంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వాల్మీకి హనుమంతరాయుడు కుమార్తె వందనతో హేమంత్‌కు శనివారం వివాహం జరిగింది. ఈ వేడుకకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మాజీ ఎంపీపీ రాజగోపాలరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి గోవిందు, ఎర్రగుంట కేశవరెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు.

భక్తులకు అన్ని సౌకర్యాలూ కల్పించండి


గవిమఠం పీఠాధిపతులు చెన్నబసవరాజేంద్రస్వామి ఆశీస్సులు తీసుకుంటున్న సహాయ కమిషనర్, ఏజెంట్

ఉరవకొండ: మార్చిలో ప్రారంభమయ్యే ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలల్లో భక్తులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలని పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్ర స్వామి సూచించారు. శనివారం కర్ణాటకలోని టుంకూరులోని పీఠాధిపతుల విశ్రాంతి భవనంలో మఠం సహాయ కమిషనర్, మేనేజర్ రాణి, ఏజెంట్ రాజన్నగౌడ్, సిబ్బంది గోపి, నారాయణస్వామి సమావేశమయ్యారు. ఈసందర్భంగా పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామిని సన్మానించారు. మఠం సహాయ కమిషనర్ మార్చిలో నిర్వహించనున్న మఠం బ్రహ్మోత్సవాలపై పీఠాధిపతులకు వివరించారు. పీఠాధిపతులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు.

బీమా రంగంలో వందశాతం ఎఫ్‌డీఐ నష్టదాయకం

రాయదుర్గంటౌన్: ఎల్ఐసీలో వంద శాతం ఎఫ్‌డీఐ నష్టదాయకమని, దీన్ని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) వ్యతిరేకిస్తుందని ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి బి.కృష్ణభూషన్ తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో ఎల్ఐసీలో ఎఫ్‌డీఐ పెంచుతూ బీమా చట్ట సవరణ బిల్లు తీసుకొచ్చే అవకాశం ఉందని, ఇదే జరిగితే సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన మేరకు బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని వంద శాతానికి పెంచడం బీమా రంగానికి, పాలసీదారులకు మేలు చేకూరదన్నారు. వందశాతం ఎఫ్‌డీఐతో స్వదేశీ భాగస్వామి కంపెనీ లేకుండానే ఒక విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీ భారతదేశంలో నేరుగా ఏర్పాటు కావడమే అన్నారు.

వైభవంగా భక్త మార్కండేయస్వామి జయంతి


కలశాలతో మహిళల ఊరేగింపు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. స్వామిని ప్రత్యేకంగా అలకరించి, పూజలు చేశారు. ఉదయం పతాకావిష్కరణ, పద్మశాలీల ప్రతిజ్ఞ, ధ్వజారోహణ, గంగపూజ, గణపతి పూజ, పంచామృతాభిషేకం, మహాన్యాస పూర్వక ఏకదాశ వార రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి కార్యక్రమాలు జరిగాయి. మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం 28వ వార్డులోని పాలబావిలో గంగపూజ చేసి 108 కలశాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లారు.

నూతన రథం ఊరేగింపు

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లి బొబ్బర్లకుంట ఆంజనేయస్వామి నూతన రథాన్ని ఊరేగించారు. గతేడాది ఫిబ్రవరిలో రథోత్సవం సందర్భంగా భక్తులు రథం లాగుతుండగా విరిగి కిందపడిపోయింది. దీంతో రూ.1.10 కోట్లతో కర్ణాటకలోని గదగ్‌లో నూతన రథాన్ని తయారు చేయించారు. ఈనెల 12న రథోత్సవం జరగనుంది.

ఆధ్యాత్మికం

భక్త మార్కండేయ ఆలయ వార్షికోత్సవం


ఆలయ ఆవరణలో హోమం చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లులో భక్త మార్కండేయ స్వామి ఆలయ 34వ వార్షికోత్సవ పూజలు శనివారం నిర్వహించారు. పద్మశాలి సేవా సంఘం సభ్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలు, గణపతిపూజ, ధ్వజారోహణ, హోమం, పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బంకా చంద్రశేఖర్, బుదార్పు ఎర్రిస్వామి, పంపన్న, అల్లంకూర అప్ప, జాన ఎర్రిస్వామి, వేల్పుల వన్నూరుస్వామి, పాల్గొన్నారు.

రేపు లక్ష్మీవేంకటేశ్వర స్వామి రథోత్సవం

కుందుర్పి: మండల కేంద్రంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం జరగనుంది. ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు బ్రహ్మరథోత్సవం, రాత్రికి ధూళోత్సవం జరగనుంది.

మడివాల మాచిదేవ జయంతి


మల్లాపురం లేఅవుట్‌లో మాచిదేవ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న రజకులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మల్లాపురం లేఅవుట్‌లో శనివారం రజకుల ఆరాధ్యదైవం వీర గణాచారి మడివాల మాచిదేవ జయంతిని రజకులు ఘనంగా జరుపుకున్నారు. ఆర్ఆర్ఏఎస్ అధ్యక్షుడు వీరేష్ ఆధ్వర్యంలో మడివాల మాచిదేవ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తిప్పేస్వామి, మెచ్చిరి శివశంకర్, వన్నూరుస్వామి, బీమా, రమేష్, గోవిందవాడ తిప్పేస్వామి, రమేష్, సిద్దేశ్ పాల్గొన్నారు.

ఘనంగా గుండు నాగప్పస్వామి సంప్రోక్షణ


సంప్రోక్షణ చేస్తున్న వేదపండితులు

కూడేరు: కొర్రకోడు–చోళసముద్రం గ్రామాల మధ్య వెలసిన అతిపురాతనన గుండు నాగప్ప స్వామికి శనివారం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సంప్రోక్షణ జరిగింది. వేదపండితులు తొలుత గణపతి పూజ నిర్వహించి, కలశ స్థాపన చేసి అనంతరం మృత్యుంజయ హోమం చేశారు. పూజల్లో ఆయా గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆదివారం నాగ ప్రతిష్ట , అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి స్వర్ణోత్సవ పూజలు


హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి స్వర్ణోత్సవాల సందర్భంగా కుంభాభిషేక పూజలు, హోమాలను శనివారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా నూతన రాజగోపుర ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం నిర్వహించనున్నారు.

పోటెత్తిన ఆంజనేయ స్వామి ఆలయాలు


బసాపురం ఆంజనేయ స్వామి

కూడేరు: మండలంలోని ముద్దలాపురం, కూడేరు, బసాపురం, రామదుర్గం, కలగళ్ల, అంతరగంగ, కడదరకుంటతో పాటు మరి కొన్ని గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. మాఘ మాసం తొలి శనివారాన్ని పురస్కరించుకొని ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. బసాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

4న పర్వతేశ్వరస్వామి రథోత్సవం

ఉరవకొండ: మండలంలోని రాయంపల్లి గ్రామంలో వెలసిన పర్వతేశ్వర స్వామి ఆలయం రథోత్సవ వేడుకలకు ముస్తాబైంది. రాయంపల్లి, నెరిమెట్ల, వ్యాసాపురంతో పాటు మండల వ్యాప్తంగా రథోత్సవ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల్లో స్వామికి విశేష పూజలు, హోమాలు ఏర్పాటు చేశారు. 4న స్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది.

పోలీసుల నాకాబందీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాలు, శివారు కాలనీల్లో పోలీసులు ముమ్మరంగా నాకాబందీ, వాహనాల తనిఖీ చేపట్టారు. అర్బన్ సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం తెల్లవారుజాము నుంచి కోట మారెమ్మగుడి ఏరియా, మల్లాపురం ఇందిరమ్మ లేఅవుట్, బళ్లారి రోడ్డు ప్రాంతాల్లో అంగళ్లు, హోటళ్లు, అనుమానితుల ఇళ్లను సోదా చేశారు. బళ్లారి ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు చేశారు. శనివారం స్థానిక వినాయక సర్కిల్‌లో దుకాణాల యజమానులతో మాట్లాడారు.

పశుగ్రాసం దగ్ధం

కంబదూరు: ఒంటారెడ్డిపల్లి రైతు అంజయ్యకు చెందిన పశుగ్రాసం దగ్ధమైంది. వివరాలు.. అంజయ్య 10 ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు, నాలుగు ట్రాక్టర్ల వరిగడ్డిని గడ్డి వాములో నిల్వ ఉంచాడు. శనివారం గుర్తు తెలియని వ్యక్తులు పశుగ్రాసానికి నిప్పటించారు. దీంతో మంటలు చేలరేగాయి. స్థానికులు గమనించి ఫైరింజన్‌కు సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చేలోపు పశుగ్రాసం కాలిబూడిదైంది.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని శీబాయి గ్రామం వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడు బసవరాజు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శీబాయి సమీపంలో కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనింది. గాయపడిన బసవరాజును స్థానికులు సీహెచ్‌సీకి, మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 7న హైదరాబాద్‌లో మంద కృష్ణ నాయకత్వంలో వేల గొంతుకలు – లక్షల డప్పుల సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ పోస్టర్లను విడుదల చేశారు. దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆహార ప్యాకెట్ల పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని యాచకులు, నిరాశ్రయులకు ఆకలి బంధం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆహార ప్యా కెట్ల ను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు నాగయ్య, మారేష్, మోతి శంకర్, సురేష్ తెలిపారు.

రేపు సామూహిక అక్షరాభ్యాసం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులోని సరస్వతీ శిశుమందిరంలో 3న సోమవారం వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసం ఉంటుందని పాఠశాల అధ్యక్షుడు పొరాళ్ల ధనార్జున తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. అక్షరాభ్యాసం చేయించేందుకు సెల్: 7981766183, 8500052415 లో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు ఉన్నత లక్ష్యం అవసరం

బొమ్మనహాళ్: విద్యార్థులు బాల్యం నుంచి ఉన్నత లక్ష్యం అవసరమని ఎస్ఐ నబీరసూల్ ఆకాక్షించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాలు, ర్యాగింగ్, సైబర్ నేరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టెక్నికల్ అసిస్టెంట్ మృతి

ఉరవకొండ: పెద్దముష్టూరుకు చెందిన ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్ (35) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు భార్య సుజిత తెలిపారు. ఎంపీడీఓ రవిచంద్ర, ఏపీఓ విమలలు సంతాపం తెలిపారు. మృతుడికి నలుగురు కుమార్తెలు ఉన్నారు.

7న మహా ప్రదర్శన జయప్రదం చేయండి

రాయదుర్గంటౌన్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈ నెల 7న హైదరాబాద్‌లో జరగనున్న వేల గొంతుకలు – లక్షల డప్పులు మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ రాయదుర్గంలో శనివారం సన్నాహక ర్యాలీ చేశారు. ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఆర్అండ్‌బీ అతిథి గృహం వరకు వంద డప్పులతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు దక్కినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు హరిగోపాల్, తిప్పేస్వామి, సతీష్, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పేస్వామి, ఇండేన్ గ్యాస్ కృష్ణ, ఏటీఎల్ గోవిందు పాల్గొన్నారు.